ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 17 ఆగస్టు 2024 | 3





పిఠాపురంలో అన్న క్యాంటీన్ ప్రారంభించి అల్పాహారం తింటున్న ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్

రూ.ఐదు భోజనం అదుర్స్



కాకినాడ జగన్నాథపురం ఘాటి సెంటర్‌లో అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఓ వృద్ధురాలు



అన్న క్యాంటీన్‌లో రూ.5కే అందించిన అల్పాహారం

- జిల్లాలో 8 అన్న క్యాంటీన్లు ప్రారంభం
- కాకినాడలో 5, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం పట్టణాల్లో మరో మూడు
- అన్నిచోట్లా పండుగ వాతావరణం
- సంతోషం వ్యక్తంచేసిన పేదవర్గాలు
- ప్రారంభోత్సవాల్లో హాజరై ఆహారం రుచి చూసిన ఎమ్మెల్యేలు, కూటమి నేతలు

ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న అన్న క్యాంటీన్ల తలుపులు తెరుచుకున్నాయి. దీంతో పేదవర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇక నుంచి ఐదు రూపాయలకే భోజనం చేయొచ్చనే ధీమా ప్రతి ఒక్కరిలో కనిపించింది. శుక్రవారం జిల్లాలో మొత్తం 8 అన్నక్యాంటీన్లు ప్రారంభంకాగా, అందులో 5 కాకినాడ నగరంలో, మిగిలిన మూడు పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం పట్టణాల్లోనూ ఉన్నాయి. ప్రారంభోత్సవం సందర్భంగా ఆయా క్యాంటీన్ల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు వచ్చి అల్పాహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తంచేశారు.



జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న కొండబాబు

అన్న క్యాంటీన్లతో ఆకలికి ఫుల్‌స్టాప్ : కొండబాబు

కాకినాడ సిటీ, ఆగస్టు 16: అన్న క్యాంటీన్ల ఏర్పాటుతో కూటమి ప్రభుత్వం పేదల ఆకలికి ఫుల్‌స్టాప్ పెట్టిందని, ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను పేదలకు అందుబాటులోకి తెచ్చిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. శుక్రవారం సిటీ నియోజకవర్గ పరిధిలో జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్, డెయిరీఫారమ్ సెంటర్, సంతచెరువు సెంటర్ వద్ద అన్న క్యాంటీన్లను కూటమి నేతలతో కలిసి కొండబాబు ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిబ్బన్ కత్తిరించి అన్న క్యాంటీన్లకు ప్రారంభోత్సవం చేశారు. ప్రజలకు స్వయంగా ఉదయం అల్పాహారం అందించిన వనమాడి అన్న క్యాంటీన్ వెబ్‌సైట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం అన్నక్యాంటీన్లు తెరిచి మాట నిలబెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి.సత్యకుమారి, మల్లిపూడి వీరు, సుంకర పావని తిరుమలకుమార్, గదుల సాయిబాబు, ఎంఏ తాజుద్దీన్, తుమ్మల సునీత రమేష్, వొమ్మి బాలాజీ, బంగారు సత్యనారాయణ, రెడ్నం సత్తిబాబు, అమలకంటి బలరామ్, అంబటి చిన్న, పొంగా బుజ్జి, పాలిక నాని, మేడిశెట్టి చిన్ని, గడ్డం పూర్ణ, సంగాని నాగూర్, చోడిపిల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదవారికి ఆకలి బాధలుండవ్ : ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 16: పేదవాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను కూటమి ప్రభుత్వం తిరిగి అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో వివేకానంద పార్కు వద్ద ఏర్పాటుచేసిన అన్నక్యాంటీన్‌ను శుక్రవారం ఉదయం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. స్వయంగా కొందరికి టిఫిన్ వడ్డించారు. రూ.5కే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం అందిస్తున్న అన్న క్యాంటీన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా మూసేసి ప్రజలకు దూరం చేసిందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన ఏయే ఆహారం అందిస్తున్నారు, మెనూ విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కమిషనర్ భావన అన్న క్యాంటీన్‌లోని ఏర్పాట్లను పరిశీలించారు. ఆహారాన్ని సరఫరా చేసే అక్షయ పాత్ర ఫౌండేషన్ నిర్వాహకులకు సూచనలు చేశారు. టిఫిన్ చేయడానికి వచ్చిన వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, స్మార్ట్‌సిటీ, ఇంజనీరింగ్, ఆరోగ్యశాఖల అధికారులు పాల్గొన్నారు.



క్యాంటీన్‌లో వడ్డిస్తున్న ఉదయ్‌శ్రీనివాస్, కమిషనర్ భావన



ఆహారం వడ్డిస్తున్న రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు

అన్నార్తుల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం : నానాజీ, చిక్కాల

సర్పవరం జంక్షన్, ఆగస్టు16: పేదలు, అన్నార్తుల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం రూ.5కే ఆహార పథకాన్ని అమలు చేస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. శుక్రవారం రమణయ్యపేట మార్కెట్ బోట్‌క్లబ్‌లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ. 8.20 లక్షలతో ఆధునీకరించిన అన్న క్యాంటీన్‌ని ప్రారంభించి అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రకాల జీవనోపాధి, కూలి పనుల కోసం పట్టణాలకు వచ్చే నిరుపేదలు, కార్మికులు, అన్నార్తుల కడుపు నింపేందుకు పూటకు రూ.5 వంతున టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించే బృహత్తర పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తే 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ అన్న క్యాంటీన్ల రద్దు చేసి పేదల కడుపుకొట్టిందన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కాగా రాత్రి ఏడు గంటలకు టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్‌కు వచ్చిన వారికి ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ వెంకటరావు, ఏఈ రమేష్‌బాబు, కూటమి పార్టీల నాయకులు రాందేవు సీతయ్యదొర, తాటికాయల వీరబాబు, శిరంగు శ్రీనివాసరావు, రాయుడు అనిల్, కౌజు నెహ్రూ, బన్ను, వేటుకూరి నాగమణి, కంచుమర్తి లావణ్య గిరిజ లక్ష్మీదేవి, కుమార్, విత్తనాల రమణ, బాలాజీ, పితాని అప్పన్న, మరుకుర్తి నాగబాబు, తేజ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకలి తీర్చారు..



కూటమి ప్రభుత్వంలో అన్న క్యాంటీన్‌లు తిరిగి తెరిచి ఆకలి తీర్చారు. ఆటో నడుపుకుంటూ ఏ పూటకి ఎక్కడ ఉంటామో మాకే తెలీదు. సంపాదించిన దానిలో రూ.150 భోజనానికి ఖర్చవుతుంది. ఇప్పుడు క్యాంటీన్లు తెరుచుకోవడంతో రూ.5కే భోజనం దొరుకుతుంది. - ఆర్.సుబ్రహ్మణ్యం, ఆటో డ్రైవర్, కాకినాడ

తృప్తిగా భోజనం చేశాను

ఎన్నో రోజుల తర్వాత తృప్తిగా భోజనం చేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం తిన్నా. పదార్థాలన్నీ రుచికరంగా ఉన్నాయి. నేను కూలి పనిచేసి జీవనం సాగిస్తూ ఉంటాను. నావంటి వారికి ఇది ఉపయోగకరం. ఇప్పటివరకూ బయట హోటళ్లలో తినేవాడిని.

- రెడ్డి నాగేశ్వరరావు, పిఠాపురం

ప్రజలకు మేలుచేసే పథకాల్లో మార్పు ఉండరాదు

పిఠాపురం అన్న క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్సీ హరిప్రసాద్

పిఠాపురం, ఆగస్టు 16: ఎవరు అధికారంలో ఉన్నా ప్రజాప్రయోజన పథకాలు అమలుచేయాలని, దీనికి రాజకీయకోణం ఆపాదించడం సరికాదని ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ అన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రజలకు మేలు చేసే పథకాల్లో మార్పులు ఉండరాదన్నారు. పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న అన్నక్యాంటీన్‌ను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజులతో కలిసి ప్రారంభించారు. ఉదయం అల్పాహారాన్ని వారు ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు పిఠాపురం నియోజకవర్గంలో మరిన్ని అన్నక్యాంటీన్‌లు ప్రారంభించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ యోచిస్తున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి అన్నక్యాంటీన్లు మూసివేస్తే వర్మాస్ కావ్య ఫౌండేషన్ ద్వారా అన్నక్యాంటీన్ నిర్వహించి మార్కెట్‌కు వచ్చే ప్రజలకు అన్నపానీయాలు అందించినట్టు తెలిపారు. కాగా అన్నక్యాంటీన్ తొలిరోజు మధ్యాహ్న భోజనాన్ని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ప్రజలకు వడ్డించారు. నాయకులు, అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు.





పెద్దాపురం, సామర్లకోటల్లో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న చినరాజప్ప

పేదలపాలిట అక్షయపాత్ర ఎన్టీఆర్ అన్న క్యాంటీన్

పెద్దాపురం, సామర్లకోటల్లో క్యాంటీన్లు ప్రారంభించిన చినరాజప్ప

పెద్దాపురం,ఆగస్టు16: పేద ప్రజలపాలిట అక్షయపాత్ర ఎన్టీఆర్ అన్నక్యాంటీన్ అని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌ను ఆయన చేతులమీదుగా శుక్రవారం పునఃప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు మూడుపూటలా అన్నం పెట్టేందుకు, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పేదల ఆకలి తీర్చడమే ప్రధాన ఉద్దేశంగా వీటిని నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ అరీఫ్ ఆలీ, విత్తనాల వెంకటరమణ, సకురు ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట, ఆగస్టు16: సామర్లకోట టీటీడీ కళ్యాణమండపం ఎదురుగా మున్సిపాల్టీ ఆధ్వర్యంలో నిర్మించిన భవనంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం అన్న క్యాంటీన్‌ను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం పలువురికి అల్పాహారాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప చేతుల మీదుగా స్వయంగా అందజేశారు. అల్పాహారం శుచి, రుచి, నాణ్యతా ప్రమాణాలను పలువురి నుంచి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పేదవారికి స్వల్పరుసుంతో అల్పాహారం, భోజనాలను ప్రతీరోజూ నిరంతరం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయమే అన్న క్యాంటీన్ అని పేర్కొన్నారు. మొదటి రోజు అల్పాహారం, భోజనాలకు అయ్యే వ్యయాన్ని తాను విరాళంగా అందిస్తానని ఎమ్మెల్యే చినరాజప్ప ప్రకటించారు. ప్రతీ ఒక్కరూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లను మరింత ప్రోత్సహించేందుకు విరాళాల రూపంలో ముందుకు రావాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు. అంతకుముందు అన్న క్యాంటీన్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కరెన్సీ నోట్ల అలంకరణలో వాసవీ అమ్మవారు



మహాలక్ష్మి అలంకారంలో వనదుర్గమ్మ

ధనలక్ష్మిగా వాసవీమాత, మహాలక్ష్మిగా వనదుర్గమ్మ

అన్నవరం, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం రత్నగిరిపై కొలువైన వనదుర్గమ్మ మహాలక్ష్మిగా, కొండదిగువ కొలువైన వాసవీమాత కరెన్సీ అలంకరణలో ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తమ ఇళ్లలో వరలక్ష్మీ వ్రతాలను ఆచరించుకున్న మహిళలు సాయంత్రం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పాచిక పారలేదు!

- ఉమ్మడి జిల్లాలో ఖనిజ సీనరేజీ డబ్బులు ఎగ్గొట్టాలన్న సుధాకర్ ఇన్‌ఫ్రా ప్లాన్‌కు గండి
- బాకీ పడ్డ రూ.44 కోట్లు కట్టకుండా తప్పించుకోవాలన్న ప్రయత్నం బెడిసికొట్టిన వైనం
- కంపెనీ ఆటలు సాగనివ్వని ప్రభుత్వం : 15 రోజుల్లోగా జమ చేయాల్సిందేనని ఆదేశాలు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిచిపోయిన సీనరేజీ వసూళ్ల దందా
- గత జగన్ సర్కారు ఓ కంపెనీకి రూ.20 కోట్లు సీనరేజీ రద్దును సాకుగా చూపిన కంపెనీ
- ఆ రద్దు చేసిన సీనరేజీ వల్ల తనకు రాబడి తగ్గిపోయిందంటూ అడ్డగోలు వాదన
- తమ కంపెనీ కట్టాల్సిన బాకీలో ఆ డబ్బు మినహాయించాలంటూ తప్పించుకునే యత్నం
- ఈలోపు అనూహ్యంగా ప్రభుత్వం మారడంతో కంగుతిన్న సుధాకర్ ఇన్‌ఫ్రా

ప్రభుత్వానికి బాకీ పడ్డ ఖనిజ సీనరేజీ డబ్బులు ఎగ్గొట్టాలన్న సుధాకర్ ఇన్‌ఫ్రా కంపెనీ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. అడ్డగోలు వాదనలతో ప్రభుత్వ ఖజానాకు పంగనామాలు పెట్టాలనుకున్న ప్రణాళికలు పటాపంచలయ్యాయి. బాకీ డబ్బులు రూ.44 కోట్లు కట్టి తీరాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. అది కూడా 15రోజుల్లోగా ఖజానాకు జమచేయాలని హెచ్చరించింది. గత వైసీపీ ప్రభుత్వ అండతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ కంపెనీ యథేచ్ఛగా చెలరేగి పోయింది. ఎక్కడికక్కడ ముక్కుపిండి సీనరేజీ కోట్లలో పిండేసింది. ప్రభుత్వానికి నెలకు రూ.9.70 కోట్లు కట్టి అంతకు పదింతలు రాబట్టేసింది. తీరా అనుహ్యంగా ప్రభుత్వం మారడంతో కంపెనీకి ఝలక్ తగిలింది. అడ్డగోలు సీనరేజీ దందా ఆగిపోయింది. ఈ సాకుతో సర్కారు బాకీ ఉన్న బకాయిలు కట్టకుండా తప్పించుకునే ప్రయత్నం చేసినా వారి పాచిక పారలేదు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గనులశాఖకు చిన్నతరహా ఖనిజాల ద్వారా ఏటా కోట్లలో ఆదాయం సమకూరుతోంది. గ్రావెల్, నల్లరాతి కొండలు, మట్టి, లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా భారీగా ప్రభుత్వానికి రాబడి వస్తోంది. అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా ఎక్కువ రాబడి వస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ రాబడి గనులశాఖకు బదులు మొట్టమొదటిసారిగా కోనసీమ జిల్లాకు చెందిన సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి అడ్డగోలుగా కట్టబెట్టేసింది. సీనరేజీ వసూలు బాధ్యత నుంచి గనులశాఖను తప్పించి సదరు కంపెనీకి అప్పగించేసింది. గనుల శాఖను డమ్మీగా మార్చేసి, సీనరేజీ వసూలు బాధ్యతంతా సుధాకర్ ఇన్‌ఫ్రాకు ఇచ్చేసింది. అందులోభాగంగా 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు ఈ కంపెనీ ఉమ్మడి జిల్లాలో సీనరేజీ వసూలు చేసుకునేలా అధికారం కట్టబెట్టింది. ఈ రెండేళ్లకు కలిపి రూ.233 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తేచాలని, అది కూడా భారం అయితే ఇందులో నెలనెలా రూ.9.70కోట్లు చొప్పున 24 వాయిదాల్లో చెల్లించాలని వెసులుబాటు ఇచ్చింది. ఇలా కంపెనీకి పూర్తి సహకారం అందించి ప్రభుత్వ పెద్దలు తెరవెనుక భారీగా పిండేశారు. అటు ప్రభుత్వం అండదండలు ఉండడంతో సుధాకర్ ఇన్‌ఫ్రా ఉమ్మడి ఇటీవల ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఉమ్మడి జిల్లాను పిండేసింది. ఎక్కడికక్కడ కొండలు, గుట్టలు, గ్రావెల్, క్వారీలు ఉన్న ప్రతిచోటా సొంతంగా మనుషులను నియమించింది. సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసింది. ఎవరు ఏ చిన్న మట్టి,గ్రావెల్ తవ్వుకున్నా ముక్కుపిండి సీనరేజీ వసూలుచేసింది. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్లరాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి కూడా వదలకుండా నెలనెలా కోట్లలో రాబట్టింది. ఈ కంపెనీకి తెరవెనుక వైసీపీ పెద్దల సహకారం ఉండడంతో గనులశాఖ కళ్లు మూసేసుకుంది. సీనరేజీ వసూళ్లలో నిబంధనలు ఉల్లంఘించినా కన్నెత్తి చూడలేదు. దీంతో ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ.9.70 కోట్ల కంటే పదింతల రెట్టింపు ఆదాయం పిండేసింది. ఇలా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కంపెనీకి కాసుల పంట పండింది. రెండేళ్లలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తంలో సింహభాగం తొలి ఆరు నెలల్లోనే లాగేసింది.

సీనరేజ చెల్లించడం ఆపేసి..

అయితే అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయన్న సమయంలో సదరు కంపెనీ ప్రభుత్వానికి సీనరేజీ డబ్బులు చెల్లించడం ఆపేసింది. ఇదేంటని గనులశాఖ అడిగితే జగన్ ప్రభుత్వం కాకినాడ జిల్లాలో ఓ కంపెనీకి భారీ లబ్ధి చేకూర్చిందని మెలిక పెట్టింది. వాస్తవానికి ఎవరికీ తెలియకుండా గుట్టుగా గత ప్రభుత్వం జిల్లాలో తీరప్రాంతంలో పనులు చేస్తోన్న ఓ ప్రముఖ కంపెనీకి సహకరించింది. రౌతులపూడి నుంచి ఈ కంపెనీ 12 లక్షల మెట్రిక్ టన్నుల నల్లరాయి తరలించగా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.20 కోట్ల రాయల్టీని రద్దుచేసి మేలు చేకూర్చింది. ఇదంతా రహస్యంగా ఉంచింది. విషయం తెలుసుకున్న సుధాకర్ ఇన్‌ఫ్రా గనులశాఖపై ఒత్తిడి తెచ్చింది. ఆ కంపెనీకి రూ.20 కోట్ల రాయల్టీ రద్దు చేయడం వల్ల తమకు రావలసిన సీనరేజీ ఆదాయం పోయిందని అభ్యంతరం తెలిపింది. అందువల్ల తాము నెలనెలా చెల్లించాల్సి ఉన్న బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ కొత్తపాట పాడింది. అయితే కంపెనీ వెనుక వైసీపీ నేతలు ఉండడంతో గనులశాఖ మొత్తబడింది. దీంతో తన ఆటలు సాగినట్లేనని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన తన బాకీ కట్టకుండా ఉండొచ్చని లెక్కలేసుకుంది. ఎన్నికలు జరిగినా తిరిగి వైసీపీ ప్రభుత్వం వస్తుందనే ధీమాతో సదరు కంపెనీ అలా తన బాకీలు కట్టకుండా ఉండిపోయింది. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కంపెనీ కంగుతింది. ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా సీనరేజీ వసూలు కాంట్రాక్టు రద్దయిపోయింది. అటు కట్టాల్సిన బాకీలు చెల్లించాలంటూ గనులశాఖ ఒత్తిడి తేవడం మొదలుపెట్టింది. కొత్త ప్రభుత్వంలో పైరవీలు చేసి బాకీలు కట్టకుండా చేయాలని సదరు కంపెనీ ప్రయత్నాలు చేసింది. కానీ ప్రభుత్వం నుంచి సదరు కంపెనీకి సహకారం దొరకలేదు. సరికదా మొత్తం సీనరేజీ బాకీలన్నీ కలిపి రూ.44కోట్లు కట్టితీరాలని ఇటీవల గట్టిగా హెచ్చరించింది. 15రోజులలోగా ఖజానాకు డబ్బులు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది. ముందు బాకీ చెల్లిస్తే తర్వాత రాయల్టీ రద్దులో సుధాకర్ ఇన్‌ఫ్రాకు అసలు సీనరేజీ రావలసి ఉందా? లేదా? తేల్చుదామని పేర్కొంది. దీంతో సుధాకర్ ఇన్‌ఫ్రా గింజుకుంటోంది.



జూడాలతో కలిసి ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

నేడు అన్ని ప్రైవేటు ఆసుపత్రులు మూత

కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన అమానుష ఘటనకు నిరసన

జీజీహెచ్ (కాకినాడ) ఆగస్టు 16: కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన అమానుష ఘటనకు నిరసనగా శనివారం కాకినాడ జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేటు ఆసుపత్రులు మూతపడనున్నాయి. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు అన్ని ప్రైవేటు ఆసుపత్రులు మూసివేయడంతోపాటు ప్రభుత్వ వైద్యులు సైతం విధులు బహిష్కరించనున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఈ నిర్ణయం తీసుకుందని వైద్యవర్గాలు తెలిపాయి.

జూడాలకు మద్దతుగా ఐలు

కాకినాడ క్రైం, ఆగస్టు 16 : కోల్‌కతా మెడికల్ కాలేజీలో ఇటీవల పీజీ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఉదంతాన్ని ఖండిస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు చేపడుతున్న ఆందోళనకు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) మద్దతు ప్రకటించింది. శుక్రవారం కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో జూనియర్ డాక్టర్లు చేపడుతున్న ఆందోళనకు ఐలు సభ్యులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి కె.నాగజ్యోతి మాట్లాడుతూ వైద్యురాలిని అత్యాచారం చేసి ఘోరంగా చంపేసిన సంఘటనపై వైద్యులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై దాడి చేయడం దుర్మార్గపు చర్యగా ఆమె అభివర్ణించారు. అఘాయిత్యానికి పాల్పడిన దుండగులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, జూడాల డిమాండ్‌లను ప్రభుత్వం తక్షణమే అంగీకరించాలని డిమాండ్ చేశారు. జూడాల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కారం అయ్యేంతవరకు వారి పోరాటానికి ఐలు పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె.శైలజ, కె.దమయంతి, ప్రేమ్ నజీర్, ధనుంజయ్, కె. రాజుబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారంపూడి దౌర్జన్యాలపై చర్యలు చేపట్టాలి

- మెయిన్‌లో

కాకినాడ జిల్లా ఎస్పీకి ఎమ్మెల్యే కొండబాబు వినతి



అల్లవరం మండలం బోడసకుర్రు వైనతేయ బ్రిడ్జి వంతెనవద్ద కనువిందు చేసిన మేఘాలు

కారుమబ్బులు కమ్మిన వేళ...

కారుమబ్బులు కనువిందు చేశాయి. ఒకపక్క తీవ్రమైన ఎండ ఉన్నా మరోపక్క నల్లని మబ్బులు ఆకాశాన్ని కమ్ముకుని చూపరులను ఆనందపరవశం చేశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు వైనతేయ బ్రిడ్జి వద్ద శుక్రవారం కనిపించిన ఈ అందమైన మేఘాలు ఔరా అనిపించాయి.

- అల్లవరం



ఏఎస్ఐ మాడా సత్యనారాయణకు పతకాన్ని అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఏఎస్ఐకి ఐపీఎం అందజేత

రాజమహేంద్రవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న మాడా సత్యనారాయణ కు ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం)ని ఎస్పీ నరసింహ కిశోర్ శుక్రవారం అందజేశారు. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సత్యనారాయణకు కేంద్ర ప్రభుత్వం ఐపీఎంని ప్రకటించింది. ఈ సందర్భంగా సత్యనారాయణను ఎస్పీ నరసింహ కిశోర్, అధికారులు, సిబ్బంది అభినందించారు. ఈ ఏడాది జిల్లా ఫైర్ ఆఫీసర్ చిన్నం మార్టిన్ లూథర్ కింగ్‌కు ఐపీఎం ప్రకటించింది. ఈ పతకాన్ని వచ్చే ఏడాది అందజేస్తారు.

19 నుంచి ఏపీఈఏపీసెట్

మూడోదశ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్

- ఈనెల 21 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన
- 20 నుంచి 22 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు
- కాకినాడ ఏపీటీలో సహాయ కేంద్రం ఏర్పాటు

జేఎన్టీయూకే, ఆగస్టు 16: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్ల భర్తీకి సంబంధించిన ఏపీఈఏపీసెట్-2024 వెబ్ ఆధారిత కౌన్సెలింగ్‌ను మొదటి, రెండో దశ ద్వారా నిర్వహించారు. అయితే రాష్ట్రస్థాయిలో సుమారు 18వేలకు పైగా ఇంజనీరింగ్ సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయని వాటిని భర్తీచేసేందుకు మూడోదశ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి కూటమి ప్రభుత్వానికి, విద్యాశాఖామంత్రి నారాలోకేష్ కి అభ్యర్థనలు రావడంతో సీటుకోసం ఎదురుచూస్తున్న ఏ ఒక్క విద్యార్థి నష్టపోకూడదని మూడో దశ వెబ్ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ఏపీఈఏపీసెట్-2024 మూడవ, తుది రౌండ్ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 19 నుంచి ప్రారంభం కానుంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లో మొదటి, రెండో దశ వెబ్‌కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ శుక్రవారం జారీ చేస్తున్నట్లు సమాచారం. ఈ కౌన్సెలింగ్ ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలోని 29 ఇంజనీరింగ్ కళాశాలల్లో మిగిలిపోయిన సుమారు 2900 సీట్లు భర్తీ కానున్నాయి. ఈనెల 19నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవచ్చని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురం ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రం సమన్వయ కర్త, ప్రిన్సిపాల్ ఎస్. జనార్దన్‌రావు తెలిపారు.

● అయితే మొదటి, రెండో దశ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరు కాని అభ్యర్థులు మాత్రమే షెడ్యూల్‌లో పేర్కొన్నవన్నీ చేయాలి. ఆవిధంగా కాకుండా మొదటి, రెండోదశ కౌన్సెలింగ్‌లో సీటు పొంది తుది దశకు కూడా ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు కేవలం వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకుంటే సరిపోతుంది. అంతేకాకుండా మొదటి, రెండో దశలో పొందిన సీటు మూడోదశలో సంబంధిత విద్యార్థికి సీటుకేటాయింపు జరిగిన వెంటనే రద్దవుతుంది. ఇప్పటివరకూ వెబ్‌కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు, అదే విధంగా కళాశాలలో చేరని విద్యార్థులు ఈఅవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి.

● అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సహాయకేంద్రంలో సంప్రదించాలి. అంతేకాకుండా 7995681678, 7995865456, 9177927677 హెల్ప్ డెస్క్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

● ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలాచేసుకోవాలి

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తోంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6నుంచి ఇంటర్ వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు. ర్యాంకు కార్డు,రేషన్ కార్డు, హాల్ టికెట్లను అప్‌లోడ్‌చేయాలి. ఈడబ్ల్యూఎస్ కులధ్రువీకరణపత్రం ఉన్న వారికి 2022నుంచి 10శాతం రిజర్వేషన్‌ను ప్రతీఏడాది అమలుచేస్తున్నారు.

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి

ర్యాంకు కార్డు, మార్కులజాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి.

షెడ్యూల్ ఇదే

- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన : ఈనెల 19 నుంచి 21 వరకూ.
- అప్‌లోడెడ్ ధ్రువపత్రాల పరిశీలన : ఈనెల 19 నుంచి 22 వరకూ
- వెబ్ ఆప్షన్ల నమోదు :ఈనెల 20 నుంచి 22 వరకూ.
- ఆప్షన్ల మార్పు : ఈనెల 23
- సీట్ల కేటాయింపు : ఈనెల 26
- సెల్ఫ్ రిపోర్టింగ్, కళాశాలల్లో రిపోర్టింగ్ : ఈనెల 26 నుంచి 30 వరకూ



పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వరలక్ష్మీ శోభ

- పాదగయకు పోటెత్తిన భక్తులు...
- పుష్కరిణిలో స్నానాలు
- బంగారం చీరతో దర్శనమిచ్చిన బాలాత్రిపుర సుందరీ అమ్మవారు

పిఠాపురం, ఆగస్టు 16: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. క్షేత్రానికి శ్రావణవరలక్ష్మి శోభ చేకూరింది. పాదగయ పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించి పూజలు చేశారు. పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో వెలసిన రాజారాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తిపీఠాల్లో దశమశక్తి పీఠాధిపతి అయిన పుర్హుతికా అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం వరలక్ష్మివ్రత పూజల సందర్భంగా వ్రతాన్ని ఆచరించే భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. రాజరాజేశ్వరీదేవి, పుర్హుతికాఅమ్మవార్లకు కుంకుమపూజలు, ప్రత్యేక అర్చనలు జరిగాయి. పుష్పార్చన చేశారు.





పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి, పుర్హుతికా అమ్మవారు

బంగారు చీరలో బాలాత్రిపురసుందరి

పోర్టుసిటీ (కాకినాడ): కాకినాడలో ప్రసిద్ధి చెందిన స్థానిక సూర్యారావుపేటలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారు భక్తులకు బంగారుచీరలో దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని అమ్మవారి ని దర్శించుకునేందుకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామునుంచే దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చింతపల్లి విజయభాస్కరరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.



కాకినాడలో బంగారు చీర అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు



సామర్లకోట భీమేశ్వరాలయంలో వెండి చీర అలంకరణలో అమ్మవారు

వెండిచీర అలంకారంలో బాలాత్రిపుర సుందరి

సామర్లకోట: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఉన్న బాలాత్రిపురసుందరి అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరులచే విశేష పుష్పార్చన పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారిని సుమారు 30కిలోలతో రూపొందించిన వెండిచీరతో సర్వాంగసుం దరంగా అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు.



మామిడికుదురు: అప్పనపల్లి ఆలయంలో గాజుల అలంకరణలో పద్మావతి అమ్మవారు



వాడపల్లిలో పవిత్రాలతో కొలువుతీరిన ఉత్సవమూర్తులు, మహా పూర్ణాహుతిలో ఎమ్మెల్యే, ఎంపీ

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

● మూడు రోజుల పాటు పూజలు ● పాల్గొన్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, ఆగస్టు 16: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు తిరుమల తరహాలో క్రతువును వైఖానసాగమశాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వసంత మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను పవిత్రా లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహాశాంతి హోమం, ప్రాయశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, పవిత్రవిసర్జన, మహదాశ్వీరచనలను వైభవంగా నిర్వహించారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మహా పూర్ణాహుతిలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉప కమిషనరు కిషోర్‌కుమార్, దేవదాయశాఖ జిల్లా అధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, అధికార పార్టీ ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

25న జాంపేట అర్బన్ బ్యాంక్ ఎన్నిక

● 12 డైరెక్టర్ పదవులకు 37 నామినేషన్లు దాఖలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : జాంపేట కోపరేటివ్ అర్బన్ పాలక వర్గ ఎన్నికలకు శుక్రవారం మొత్తం 37 మంది నామినేషన్లు దాఖలు చేసినట్టు రాజమహేంద్రవరం డివిజనల్ కోపరేటివ్ అధికారి, ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఛైర్మన్ అభ్యర్థి బొమ్మన జయకుమార్‌తోపాటు ప్రస్తుత పాలకవర్గ డైరెక్టర్ ప్రసాదుల హరనాథ్ తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు. బ్యాంక్‌కు సంబంధించిన మొదటి నియోజకవర్గంలో 10 డైరెక్టర్ పదవులకు 30మంది నామినేషన్లు దాఖలుచేయగా, 2వ నియోజక వర్గంలో ఒక పదవి కోసం ఇద్దరు, మూడో నియోజకవర్గంలో ఒక పదవి కోసం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం స్ర్కూట్నీ ఉంది. ఆదివారం నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. జాంపేట ప్రధాన బ్యాంక్ పరిధిలోని 10మంది కంటే ఎక్కువమంది నిలబడితే ఎన్నిక తప్పదు. మిగతాచోట్ల ఒకరికన్నా ఎక్కువ మంది ఉన్నా పోలింగ్ తప్పదు. 25న పోలింగ్ నిర్వహిస్తారు. ఛైర్మన్ అభ్యర్థి బొమ్మన జయకుమార్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు హాజరయ్యారు. బ్యాంక్‌లో సుమారు 32వేలకుపైగా ఓటర్లు ఉండగా 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారన్నారు. ప్రధాన బ్రాంచి జాంపేట, మోరంపూడి ధవళేశ్వరం, సీతంపేట, అనపర్తి, గోకవరం, పెద్దాపురం, కాకినాడ, ఏలూరు, కొవ్వూరుల్లో మొత్తం 10 బ్రాంచిలు ఉన్నాయన్నారు. ఈ బ్యాంక్ పరిధిలోని బ్రాంచిలను మూడు నియోజకవర్గాలుగా విభజించారు. మొదటి నియోజకవర్గంలో జాంపేట మెయిన్ బ్రాంచి ఒకటి. ఇక్కడ 15,623 మంది ఓటర్లు ఉన్నారు. మోరంపూడి బ్రాంచిలో 2142 మంది ఓటర్లు, ధవళేశ్వరం బ్రాంచిలో 3221 మంది ఓటర్లు, సీతంపేట బ్రాంచిలో 2766 మంది ఓటర్లు కలిపి మొత్తం 23,752 మంది ఉన్నారు. వీరు మొత్తం 10 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఇక నియోజకవర్గం 2 పరిధిలో మొత్తం 1901 మంది ఓటర్లు ఉన్నారు. వీరు ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. ఈ నియోజకవర్గం పరిధిలో రెండు బ్రాంచిలు ఉన్నాయి. అనపర్తిలో 963 మంది ఓటర్లు ఉన్నారు. గోకవరం బ్రాంచిలో 938 మంది ఉన్నారు. మూడో నియోజకవర్గంలో నాలుగు బ్రాంచిలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 2071 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. పెద్దాపురం బ్రాంచిలో 963 మంది, కాకినాడ బ్రాంచిలో 834 మంది, ఏలూరు బ్రాంచిలో 480 మంది, కొవ్వూరు బ్రాంచిలో కేవలం ఏడుగురు ఓటర్లు ఉన్నారు.

గంజాయి తాగాలని వేధించినందుకు హత్య

● హత్య కేసులో నిందితుల అరెస్ట్

రాజోలు, ఆగస్టు 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెల్లంకకు చెందిన పడమటి నోయల్‌జార్జిన్‌ను హత్య చేసిన కేసులో నిందితులు రాపాక ప్రకాష్, ప్రశాంతి, యర్రంశెట్టి ప్రేమ్‌కుమార్లను శుక్రవారం అరెస్టు చేసినట్టు రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపారు. రాజోలు సర్కిల్ కార్యాలయంలో ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మలికిపురానికి చెందిన నోయల్‌జార్జి కనిపించడంలేదని నోయల్ తండ్రి పడమటి రత్నంరాజు మలికిపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ఉత్తర్వుల ప్రకారం కొత్తపేట డీఎస్పీ ఆదేశాలతో సీఐ ఆధ్వర్యంలో మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. గుడిమెల్లంకకు చెందిన రాపాక ప్రశాంతి ఆరు నెలల క్రితం మలికిపురానికి చెందిన నోయల్‌జార్జిను ప్రేమించింది. వీరు కాకినాడలో నివాసం ఉన్నారు. నోయల్‌జార్జి మందు, సిగరెట్, గంజాయికి బానిసై ప్రశాంతిని కూడా తాగమని వేధించేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక ప్రశాంతి ఈనెల 9న అన్నయ్య రాపాక ప్రకాష్‌కు విషయాన్ని వివరించింది. ప్రకాష్ తన స్నేహితుడు రాజోలుకు చెందిన యర్రంశెట్టి ప్రేమ్‌కుమార్, ప్రశాంతితో కలిసి నోయల్‌జార్జిని హత్య చేసేందుకు ప్రణాళిక చేశారు. ఈనెల 9వ తేదీన రాత్రి ప్రశాంతితో నోయల్‌జార్జికి ఫోన్ చేయించి దిండి-చించినాడ బ్రిడ్జి వద్దకు రప్పించారు. ఇనుపరాడ్లతో జార్జిని కొట్టి చంపి గోదావరిలోకి పడేశారు. జార్జి బైక్‌ను బ్రిడ్జి వద్ద పెట్టి అక్కడి నుంచి అదృశ్యమైనట్టు సృష్టించి పరారయ్యారు. ఈనెల 13న జార్జి మృతదేహం అంతర్వేది పల్లిపాలెం అన్నాచెల్లెల గట్టు సమీపంలో గోదావరి గట్టున లభ్యమైంది. ఈనెల 15న దిండి చెక్‌పోస్టు వద్ద నిందితులు ప్రకాష్, ప్రేమ్ కుమార్, ప్రశాంతిని అరెస్టు చేశామన్నారు.



రాజోలులో నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ గోవిందరాజు

చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా బదిలీ



బదిలీపై వెళుతున్న చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు, ఆగస్టు 16: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూ రు ఏఎస్పీ రాహుల్ మీనా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్రముఖ్య కార్యదర్శి నీరజ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాహుల్‌మీనా గత ఏడాది మే1న చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. రాహుల్‌మీనాకు పదోన్నతి కల్పిస్తూ ఎస్ఆర్‌పీ గుంతకల్ ఎస్పీగా బదిలీ చేశారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన పంకజ్‌కుమార్ మీనాకు చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పంకజ్ కుమార్ మీనా ఇప్పటివరకు గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండర్‌గా విధులు నిర్వర్తించారు.

నేడు జీఎస్ఎల్-స్వతంత్ర హాస్పిటల్స్ వార్షికోత్సవం

రాజానగరం, ఆగస్టు 16: ఈనెల 17న జీఎస్ఎల్-స్వతంత్ర హాస్పిటల్స్ 38వ వార్షికోత్సవాన్ని రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు సినీ దర్శకుడు వి.సందీప్ రెడ్డి వంగా ముఖ్యఅతిథిగా విచ్చేస్తార న్నారు. గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎస్పీ నరసింహ కిషోర్ పాల్గొంటున్నట్టు చెప్పారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు వీర్రాజు

ఆలమూరు, ఆగస్టు 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మోదుకూరులో పంట చేలో ఒక రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గుమ్మిలేరుకు చెంది న ముచ్చారి వీర్రాజు (40)గ్రామ సరిహద్దులో ఉన్న మోదుకూరు పంట భూములలోకి పాడిగేదెకు పచ్చగడ్డి నిమిత్తం వెళ్లాడు. పచ్చగడ్డి కోసి మోపు తీసుకుని వస్తుండగా 33కేవీ విద్యుత్‌లైన్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. వీర్రాజుకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఏఎన్ఎం దుర్మరణం



మృతిచెందిన ఏఎన్ఎం నాగసత్యవేణి

సామర్లకోట, ఆగస్టు 16: కాకినాడ జిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ సమీపాన స్కూటీపై వస్తున్న ఏఎన్ఎంను లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలోని వేట్లపాలెం పీహెచ్‌సీలో ఏఎన్ఎంగా పని చేస్తున్న నాగసత్యవేణి (39) శుక్రవారం సాయంత్రం స్కూటీపై సామర్లకోట వైపు వస్తుండగా ఓవర్‌టేక్ చేస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ఏఎన్ఎం తీవ్రంగా గాయపడింది. తలకు బలమైన గాయాలుకావడంతో హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్పటివరకు తమతో విధులలో పాల్గొన్న తమ సహచరురాలు నాగసత్యవేణి ప్రమాదంలో మృతి చెందిందన్న సమాచారం తెలిసి వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేసును సామర్లకోట పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుషోత్తపట్నం దేవస్థానం భూముల్లో

మళ్లీ రాజుకున్న రగడ

- కోర్టు ధిక్కారణ కేసున్నా పురుషోత్తపట్నంలో ఆగని నిర్మాణాలు
- భద్రాద్రి దేవస్థానం ఈవోపై దాడికి యత్నం, అడ్డుకున్న సిబ్బంది

ఎటపాక ఆగస్టు 16 : ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి రామయ్య భూముల్లో మళ్లీ అక్రమణలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో రాష్ట్ర హైకోర్టు భద్రాద్రి దేవస్థానంకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా దానిని నిర్ణీత సమయంలో అమలు చేయకపోవడంతో భద్రాద్రి దేవస్థానం రాష్ట్రీయ వానరసేన కోర్టు ధిక్కరణ పిటీషన్ హైకోర్టులో దాఖలు చేశాయి. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలు చోటుచేసుకోకుండా చూడాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛ గా అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నాయని దేవస్థానం అధికార వర్గాలు ఆరోపిస్తున్నాయి. పురుషోత్తపట్నంలోని శ్రీగోకులలంకకు ఎదురుగా ఉన్న ఖాళీ భూముల్లో గత రెండు నెలలుగా అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటున్నా రెవెన్యూశాఖ అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంతో శుక్రవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, తన సిబ్బంది అక్కడికి చేరుకొని అక్రమ నిర్మాణంను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిపై దాడికి ప్రయత్నించగా దేవస్థానం సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సమయంలో పలువురు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలను తొలగించే ప్రయత్నం సిబ్బంది చేస్తుండగా వాటిని ఇంటి నిర్మాణదారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో మళ్లీ వాగ్వివాదం, దూషణలు చోటుచేసుకున్నాయి. ఎస్ఐ పార్థసారధి తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని నిర్మాణం చేస్తున్న వారిని పనులు ఆపాలని స్పష్టం చేశారు.



దేవస్థానం అధికారులు, నిర్మాణదారుల మధ్య తోపులాట దృశ్యం

మీరు తొలగిస్తారా.. ...మేమే తొలగించాలా..

ఎటపాక ఆర్ఐతో దేవస్థానం ఈవో రమాదేవి

నేను కూడా రెవెన్యూ డిపార్టుమెంటు నుంచే వచ్చాను...దేవస్థానం భూముల్లో నిర్మాణాలు జరుగుతుంటే మీరేం చేస్తున్నారని ఆర్ఐ బాపిరాజును దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి నిలదీశారు. రామాలయ భూముల్లో ఇళ్ల కట్టేందుకు పట్టా ఉందా....లేక అనుమతులు ఉన్నాయా.. మేము తీసేందుకు వస్తే మాత్రం మీరొస్తున్నారు... అక్కడి వారు నిర్మాణ పనులు చేస్తుంటే మీరు దగ్గరుండి ఏం చేస్తున్నారని ఈవో ఆర్ఐని ప్రశ్నించారు. మీ వ్యక్తిగత ఆసక్తి ఏమైనా ఉందా, రెవెన్యూ శాఖ తరఫున మీరేం చేస్తున్నారని ఆర్ఐని ఈవో నిలదీశారు. రాముడి భూములంటే మీకు బాధ్యత లేదా, గత ప్రభుత్వ హయాంలో అధికారులు పట్టించుకోలేదు. ప్రభుత్వం మారిన తరువాత ఇరువురు సీఎంలు భూముల విషయమై చర్చిస్తున్నారు. ఈ సమయంలో కూడా మీరు ఎందుకు పట్టించుకోవడంలేదని ఆమె ప్రశ్నించారు.

వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం

పిఠాపురం, ఆగస్టు 16: టీటీడీ నిర్వహణలోని పట్టణంలో పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య పవిత్ర ఉత్సవాలకు శుక్రవారం రాత్రి అంకురార్పణ జరిగింది. ఈ ఉత్సవాలు 19వ తేది వరకూ జరుగుతాయి. 17న పవిత్ర ప్రతిష్ఠ, 18న పవిత్ర సమర్పణ, 19న మహా పూర్ణాహుతి జరుగుతుందని టీటీడీ టెంపుల్ ఇనస్పెక్టర్ సందీప్ తెలిపారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

ప్రత్తిపాడు, ఆగస్టు 16: ప్రత్తిపాడు ఎంపీడీవోగా శుక్రవారం ఎంవీఆర్ కుమార్‌బాబు పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన కుమార్‌బాబు ఎన్నికల విధుల నేపథ్యంలో కృష్ణా జిల్లా ఉంగుటూరుకు బదిలీ అయ్యారు. తిరిగి పంచాయతీ రాజ్ శాఖ ఎంపీడీవోల బదిలీల ఆదేశాలకు జారీ చేయడంతో ఇక్కడ చేరారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

గండేపల్లి: గండేపల్లి ఎంపీడీవోగా పికెఎస్ వెంకటరామన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు భీమవరంలో పనిచేసి గండేపల్లికి వచ్చారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పనిచేసిన హనుమంతరావు బదిలీపై వైజాగ్ వెళ్లారు.

సామర్లకోట: సామర్లకోట ఎంపీడీవోగా డి.శ్రీలలిత బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్యామ్‌సుందర్ విశాఖ జిల్లాకు బదిలీ అయ్యారు. తుణుకు ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీలలిత సామర్లకోట ఎంపీడీవో గా బదిలీ అవ్వడంతో బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్పను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సీఐల బాధ్యతల స్వీకరణ

కాకినాడ క్రైం, ఆగస్టు 16: కాకినాడ టూటౌన్, పోర్టు పోలీస్‌స్టేషన్ల సీఐలుగా మజ్జి అప్పలనాయుడు, పి.సునీల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన నాయక్, సుమంత్‌లు సాధారణ బదిలీల్లో భాగంగా వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారు. టూటౌన్ సీఐగా వచ్చిన అప్పలనాయుడు 2009 ఎస్ఐ బ్యాచ్ కు చెందినవారు. అలాగే సునీల్‌కుమార్ 1998 ఎస్ఐ బ్యాచ్‌కు చెందినవారు.

రెండు వర్గాల మధ్య కొట్లాట

కరప, ఆగస్టు 16: 2 వర్గాల మధ్య ఘర్షణ కొట్లాటకు దారితీసింది. పరస్పర ఫిర్యాదులతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ తూపాటి రామకృష్ణ తెలిపారు. మండలంలో గురజనాపల్లికి చెందిన అడబాల మంగ అనే మహిళ అదే గ్రామంలో నివసిస్తున్న ఆమె కుమార్తె ఆచంట భవానీ ఇంట్లో ఉంటుంది. గురువారం రాత్రి మంగ మనవడు శివకుమార్ ఇంటి బయట బైక్‌పై కూర్చుని ఉండగా ఒక కారు వచ్చి అతడిని ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ సురేష్‌ను పట్టుకుని నిలదీశారు. జరిగిన విషయాన్ని డ్రైవర్ కారు యజమాని అడబాల రాజాబాబుకు చెప్పడంతో అతడు ఆవేశంగా వచ్చి ఐరన్ గొట్టంతో మంగ మీద దాడిచేసి గాయపర్చాడు. కాగా పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని ఆచంట శివకుమార్ అనే వ్యక్తి కారులో వస్తున్న తన పైన, తన భార్య లక్ష్మి, కుమార్తెలు తేజశ్రీ, అపర్ణ, లావణ్యలపై ఐరన్ గొట్టంతో దాడి చేసినట్టు అడబాల రాజాబాబు ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదులతో ఇరువర్గాల్లోని ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు : సీఐ

గొల్లప్రోలు, ఆగస్టు 16: మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, పోలీసు తనిఖీల్లో పట్టుబడితే వాహన యజమానులపై కూడా చర్యలు తీసుకుంటామని పిఠాపురం సీఐ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గొల్లప్రోలు పట్టణం మెయిన్‌రోడ్డులో గల గానుగచెట్టు వద్ద శుక్రవారం రాత్రి స్థానికులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

'చోరీల నియంత్రణకు ఎల్‌హెచ్‌ఎంఎస్'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 16: చోరీల నియంత్రణ పోలీసులు అందుబాటులోకి తీసుకొచ్చిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు కోరారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలు పెరుగుతోండటంతో నేరస్తులను పట్టుకునేందుకు ఈ యాప్‌ని అమల్లోకి తీసుకువచ్చామన్నారు. పేరు, మొబైల్ నెంబమర్, ఇంటి చిరునామా వివరాలను పోలీసుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివాహాది శుభకార్యాలకు వెళ్లే సమయంలో ఇంట్లో బంగారు నగలు ఉంచరాదని, లాకర్లలో భద్రపరచుకోవాలని ఆయన సూచించారు.

'ప్రజల భాగస్వామ్యంతోనే దొంగతనాలకు చెక్'

తాళ్లరేవు, ఆగస్టు 16: మండలంలో జరుగుతున్న దొంగతనాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాళ్లరేవులో దొంగతనాల నివారణకు ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దొంగతనాలు చేసేవారు చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. గ్రామాల్లో ఇళ్ల యజమానులు శుభకార్యాల కోసం బయటకు వెళ్లేటపుడు పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. గ్రామాల్లో అనుమానంగా సంచరించేవారిని ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

హైస్కూల్ అభివృద్ధికి సాయం

కరప, ఆగస్టు 16: మండంలో గురజనాపల్లి హైస్కూల్ అభివృద్ధికి జనసేన నాయకులు కర్నాసుల పుష్పరాజు రూ.25వేలు, పబ్బినీడి వెంకటకృష్ణ రూ.25వేలు, మాగాపు గోవిందరాజు రూ.10వేలు చొప్పున హెచ్‌ఎం ఎ.సాయిమోహన్‌కు అందజేశారు. ఈ సొమ్మును బ్యాంక్‌లో డిపాజిట్ చేసి విద్య, క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ పి.నూకరాజు, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ వీవీ రమణమూర్తి తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, ఆగస్టు 16: పట్టణ పరిధిలోని పలు విద్యుత్ ఫీడర్లు మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. రాజీవ్ గృహకల్ప ప్రాంతం, ప్రభుత్వాసుపత్రి వెనుక యానాదుల కాలనీ, గణపతినగరం, పెద్దాపురం రోడ్డు, లారీ యూనియన్ కార్యాలయం రోడ్డు, గాంధీనగర్, అమ్మాణమ్మా నాయుడు కాలనీ, టిడ్కో గృహాలు, పెద్దపులి చెరువు ప్రాంతం, మాజేటి నగర్, భాస్కర్ కాలనీ, సాయినగర్, మెహెర్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేత

సామర్లకోట, ఆగస్టు 16: సామర్లకోట కెనరా బ్యాంక్ సౌజన్యంతో డాక్టర్ అంబేడ్కర్ విద్యా ప్రోత్సాహక నగదు పంపిణీలో భాగంగా పట్టణ పరిధిలో అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు రూ.21 వేల నగదు స్కాలర్‌షిప్స్‌ను అందజేసారు. ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో బ్యాంక్ మేనేజర్ ఆర్.విజయానంద్, కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్ చేతుల మీదుగా నగదు చెక్‌లను అందజేశారు. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పొలంబడి కార్యక్రమాలు

జగ్గంపేట, ఆగస్టు 16: మండలంలోని గొల్లలగుంట గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ భ్రమరాంబ రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పొలంగట్లపై బంతిమొక్కలు నాటడం ద్వారా కొన్ని రకాల కీటకాలు వ్యాప్తిని నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల ఏవో రెడ్డి శ్రీరామ్, గొల్లలగుంట వ్యవసాయ సహాయ సహాయకులు డి.రఘు, రైతులు పాల్గొన్నారు.

గండేపల్లి: గ్రామంలో మండల వ్యవసాయాధికారి సద్గురుమూర్తి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కరరావు, రమ్య, వీఏఏ అంజలి, వీహెచ్ఏ సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జయంతి

కాకినాడ సిటీ, ఆగస్టు 16: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తుల రమణ పూలమాల వేసి నివాళులర్పించారు. రమణ మాట్లాడుతూ బారువాలో గ్రామంలో జన్మించిన లచ్చన్న స్వాతంత్ర్య సమరంలో మహాత్మాగాంధీ పిలుపునందుకుని పాల్గొన్నారన్నారు. బీసీ సంక్షేమ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు విశ్వనాధపల్లి శ్రీనివాసరాజు, నాయి బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరనీడి గోపాలకృష్ణ, బీసీ నాయకులు జోగా రాజు, కాళ్లకూరి నాగేశ్వరరావు, మల్లువలస వీర్రాజు, మైగాపుల వంశీరాము, ఎస్ సునీల్, ఎసతీష్, ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

కాకినాడ రూరల్, ఆగస్టు 16: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని యంగ్‌మైండ్స్ రేపటి కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐఆర్‌సీఎస్ సహకారంతో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వాకాడ వెంకటరమణ పర్యవేక్షణలో తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, యంగ్ మైండ్స్ యూత్ ఐకాన్ వనమాడి మోహన్ వర్మ, టీడీపీ రాష్ట్ర కన్వీనర్ బోళ్ల కృష్ణమోహన్ ప్రారంభించగా 100 యూనిట్ల రక్తాన్ని దానంచేశారు. మాజీ సైనికులు, రైతులను సత్కరించారు.సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

జ్వరాలతో ప్రజలు సతమతం

కొతపల్లి, ఆగస్టు 16: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో సతమతమవుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడం, ఎండలు విపరీతంగా ఉండడంతో జ్వరం విపరీతంగా రావడం, ఒళ్ళంతా విపరీతమైన నొప్పులు ఉండడం, నడవలేకపోవడం, కీళ్ల వద్ద నొప్పులు రావడంతో బాధితులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. కొమరగిరి గ్రామంలో సుమారు 100నుంచి 150 మందికి జ్వరాలు వచ్చాయి. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది గ్రామాల్లో నిత్యం ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేస్తున్నా, ప్రజలు త్వరగా కోలుకోవాలని ప్రవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా నాణ్యమైన మందులు సరఫరాచేసి ఆరోగ్యాన్ని రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయాలకు శ్రావణశోభ!

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు
- అమ్మవార్లకు అలంకరణలు
- దర్శించుకున్న మహిళలు


ఏలేశ్వరం:యర్రవరంలో వరలక్ష్మికి అలంకరణ


గొల్లప్రోలు రూరల్: తాటిపర్తిలో అపర్ణాదేవి


పెద్దాపురంలో బంగారు, వెండి పుష్పాల అలంకరణలో మరిడమ్మ

పెద్దాపురం, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాలను మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గృహాల్లో వరలక్ష్మీ వ్రతాలను ఆచరించి తమ మాంగళ్యం పదికాలాలపాటు నిలవాలని కోరుకున్నారు. పెద్దాపురంలో మరిడమ్మ ఆలయంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్థానిక మున్సిపల్ సెంటర్ వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో, మండల పరిధిలోని కట్టమూరు కనకదుర్గ ఆలయంలో, కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్ర త్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సామర్లకోట: సామర్లకోట బడేలమ్మ చెరువు వద్ద గల నవదుర్గాలయంలో ఆలయ వ్యవస్థాపకురాలు కనకవిజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మి వ్రతపూజల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధుల సమక్షంలో రాజప్పను కనకవిజయలక్ష్మి ఘనంగా సత్కరించి వేదపండితులచే వేదాశీర్వచనం నిర్వహించి ప్రసాదాలందజేసారు. అష్టలక్ష్మిల పూజలు, సామూహిక వరలక్ష్మి వ్రతపూజలు జరిగాయి.

కొత్తపల్లి: కొమరగిరిలో విశ్వేశ్వరస్వామి ఆలయంలో శ్రీఅన్నపూర్ణదేవికి వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా సహస్రనామ కుంకుమార్చన, సహస్రనాయ పుష్పార్చన నిర్వహించారు. భక్తులకు కుంకుమను పంపిణీ చేశారు.

కిర్లంపూడి: మండల గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారికి మహిళలు పిండివంటలు చేసి వరలక్ష్మీవ్రతం ఆచరించి ప్రత్యేక పూజలు చేపట్టారు.

జగ్గంపేట: గ్రామంలో చెరువు గట్టుపై కనకదుర్గమ్మ గ్రామదేవత రావులమ్మ, శివాలయం, ఇస్కాలేము విష్ణు ఆలయం, శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు.

గండేపల్లి: మండలంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఇంటి దగ్గర వరలక్ష్మి వ్రతాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామపంచాయతీ గ్రాంటులో పాలకనకమ్మతల్లికి అర్చకులు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో భక్తులు కుంకుమపూజ, అభిషేకాలను నిర్వహించారు. గ్రాంటు, భైరవపాలెం, గిరియాంపేట, గాడిమొగ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ప్రత్తిపాడు: మండలంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మిపూజలు నిర్వహించారు. ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, లంపకలోవ, గజ్జెనపూడి గ్రామాల్లోని కనకదుర్గఅమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పిఠాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డు, గుట్టల వీధి, జగ్గయ్యచెరువుకాలనీ, సినిమాసెంటర్, మంగాయమ్మరావుపేట, అగ్రహారం తదితర ప్రాంతాల్లోని కనకదుర్గ ఆలయాలు, ఇతర ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే పూజలు ప్రారంభించారు. కనకదుర్గ ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు.

గొల్లప్రోలు: పట్టణంలోని బస్టాండు, దేవినగర్, కరణంగారి తోట, తాటిపర్తి రోడ్డు తదితర ప్రాంతాల్లో గల కనకదుర్గ ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. కుంకుమపూజలు చేశారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గొల్లప్రోలు రూరల్: మండలంలోని చేబ్రోలు, దురాడ, చెందుర్తి, వన్నెపూడి, కొడవలి తదితర గ్రామాల్లో కనకదుర్గమ్మ, ఇతర అమ్మవార్ల ఆలయాలను మహిళలు దర్శించుకుని పూజలు చేశారు. తాటిపర్తి గ్రామంలోని అపర్ణాదేవికి విశేష అలంకారం చేశారు. అమ్మవారికి మహిళలు కుంకుమపూజలు చేశారు.

కరప: మండలవ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు అత్యంత భక్తిశ్రదలతో ఆచరించారు. తెల్లవారుజామునే లేచి రకరకాల పిండి వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి వరలక్ష్మిదేవి పూజ చేశారు. సాయంత్రం సమీపంలోని దుర్గాదేవి, సంతోషిమాత ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ఉపవాసదీక్షను ముగించారు.

ఏలేశ్వరం: మండలంలో యర్రవరం, లింగంపర్తి, జె.అన్నవరం, సిరిపురంలో కనకదుర్గమ్మ తల్లి, వరలక్ష్మీ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఏలేశ్వరంలో తోట వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, సువ్వయ్యమ్మపేట ఆలయాలను అర్చకులు పూలతో తీర్చిదిద్ది, అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు చీర, రవిక, బంగారు రూపు, పిండి వంటలు నైవేద్యంగా ఇచ్చారు.

తుని రూరల్: ప్రసిద్ధ ఆధ్యాత్మిక పీఠం తపోవనం, ఎస్.అన్నవరం, శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, లోవ దేవస్థానంలో పూజలు, కుంకుమార్చనలు చేశారు. తపోవనంలో ప్రత్యేక పూజల్లో పీఠాధిపతులు శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ పాల్గొన్నారు.

రౌతులపూడి: రౌతులపూడి దుర్గాదేవి ఆలయంలో పూజారి చిట్టెం బానుబాబు ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం కుంకమపూజలు నిర్వహించారు.


కొత్తపల్లి: కొమరగిరిలో అన్నపూర్ణదేవికి పుష్పార్చన


ప్రత్తిపాడు: రాచపల్లిలో అపీత కుచాంబ

పాఠశాలల అభివృద్ధిలో విద్యాకమిటీలు కీలకం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


ఎమ్మెల్యేను అభినందిస్తున్న విద్యాకమిటీ సభ్యులు

ప్రత్తిపాడు, ఆగస్టు 16: పాఠశాలల అభివృద్ధిలో విద్యాకమిటీలు కీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన నూతన విద్యాకమిటీ సభ్యులు శుక్రవారం ప్రత్తిపాడులో ఎమ్మెల్యేను కలిశారు. నూతనంగా ఎన్నికైన విద్యాకమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి పాఠశాలల ప్రగతికి తోడ్పాటునందించి కూటమి ప్రభుత్వానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. శంఖవరం మాజీ జడ్పీటీసీ బచ్చల గంగ, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్ తదితరులున్నారు.

ఆక్రమణల పనుల నిలుపుదల

సామర్లకోట, ఆగస్టు 16: పట్టణ పరిధిలో ఏడీబీ రోడ్డు సమీపాన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక గల కొండచెరువు అనే ఇరిగేషన్ చెరువు గర్భాన్ని మట్టితో కప్పి సుమారు ఎకరంన్నర విస్తీర్ణాన్ని అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వైనంపై సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తదితర వీఆర్వోలు, సర్వేయర్లు వెళ్లి పనులను నిలుపుదల చేశారు. ఆక్రమణలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను, ల్యాండ్ ఫిల్లింగ్ యంత్రాలను బయటకు తీసుకురావాలని పనులను తక్షణం నిలుపుదల చేయాలని ఆక్రమణ చర్యలకు పాల్పడుతున్న కొప్పిశెట్టి రవి తదిరులను తహశీల్దార్ ఆదేశించారు. సదరు అక్రమ ఆక్రమణలపై జిల్లా ఉన్నతాధికారులు, ఆర్డీవోకు నివేదికలు అందజేస్తామని ఆయన చెప్పారు. వీఆర్వో జయమ్మ, సర్వేయర్ సుబ్బారావు తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కిర్లంపూడిలో ఎన్‌సీసీ శిక్షణ


ఎస్ఎంసీ చైర్మన్‌కు ఎన్‌సీసీ విద్యార్థుల స్వాగతం

కిర్లంపూడి, ఆగస్టు 16: కిర్లంపూడి కొక్కొండ రామశేష గిరి పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ ఆళ్ల బాబులు అభినందించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన ఎన్‌సీసీ శిక్షణా కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు సందర్శించారు. పాఠశాల హెచ్‌ఎం కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ మాస్టర్ ఎస్.రాజేష్ విద్యార్థులకు ఈ శిక్షణ ఇస్తున్నారు.

ఏఎస్ఐకు ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న గోవింద్‌రావు

కాకినాడ క్రైం, ఆగస్టు 16: కాకినాడ టూటౌన్ నేర విభాగంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న కొప్పిశెట్టి గోవింద్‌రావు సుదీర్ఘకాలం నేర విభాగంలో పని చేసి అనేక క్లిష్ట తరమైన కేసులను ఛేదించిన నేపథ్యంలో ఆయన పేరును ఎస్పీ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గోవింద్‌రావుకు ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

'ఆదిత్య' అధ్యాపకుడికి డాక్టరేట్

గండేపల్లి, ఆగస్టు 16: సూరంపాలెంలోని ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ మేనేజ్‌మెంట్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న పీఎస్‌వివి సత్యనారాయణకు భారతీయ విశ్వవిద్యాలయం కోయంబత్తూరు వారు డాక్టరేట్ ప్రదానం చేశారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణరెడ్డి తెలిపారు. సత్యనారాయణ సమర్పించిన థీసిస్‌కు విశ్వవిద్యాలయం అధ్యాపకుడు డాక్టర్ వి.రామానుజన్ పర్యవేక్షణలో అవార్డు అందుకున్నారు.

తుని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం

శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, ఆగస్టు 16: రాబోయే ఐదేళ్లలో కోట్లలో నిధులు ఖర్చు చేసి తుని నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టంచేశారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన నియోజకవర్గంలో గల పాఠశాలల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఎన్ఆర్‌జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం తునిలో జరగగా వారిద్దరూ మాట్లాడుతూ ఇప్పటికే తునిలో రూ.10 కోట్లు ఎన్ఆర్‌జీఎస్ నిధులతో అభివృద్ధి పనుల రూపకల్పన జరుగుతుందన్నారు. టీడీపీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో తునిలో అరాచకపాలన నశించి ప్రశాంత వాతావరణం ఏర్పడిందన్నారు. పాఠశాల కమిటీలు విద్యాలయాల అభివృద్ధి, విద్యార్థుల ఉన్నతికి కృషిచేయాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించాలని, పాఠశాల అభివృద్ధి అవసరాలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని సూచించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, టీడీపీ నేత యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, ఇనుగంటి సత్యనారాయణ, గాడి రాజబాబు కోడా వెంకటరమణ పాల్గొన్నారు.

రుణాల లక్ష్యాన్ని పూర్తి చేయాలి : కమిషనర్


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 16: స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంజూరు చేసే రుణాలు, వీధి వ్యాపారులు, చిన్న తరహా వ్యాపారాలు చేసుకునే వారికి పీఎం స్వానిధి పథకం ద్వారా అందజేసే రుణాల లక్ష్యాన్ని పూర్తి చేసేలా చూడాలని మెప్మా అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ సూచించారు. శుక్రవారం కమిషనర్ తన చాంబర్‌లో మెప్మా అధికారులతో పలు విషయాలపై సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా స్వయం సహాయక సంఘాలకు అందజేయాల్సిన రుణ లక్ష్యాలపై చర్చించారు. బ్యాంకు లింకేజీకి సంబంధించి సెప్టెంబర్ నాటికి వెయ్యి సంఘాలకు రూ.40కోట్ల లక్ష్యం కాగా ఆగస్టు 2024 నాటికి 362 సంఘాలకు రూ.41.41 కోట్ల లక్ష్యానికి చేరుకున్నామని మెప్మాసిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరావు వివరించారు. కార్యక్రమంలో మెప్మాహెడ్ ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రసాద్, ఇన్‌చార్జి టీపీఆర్ఓ సతీష్ పాల్గొన్నారు. నగరపాలక సంస్థ సెక్షన్ విభాగాధిపతులతో కమిషనర్ ప్రజా పరిష్కార ఫిర్యాదులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే వినతులను స్వీయ పరిశీలన అనంతరం మాత్రమే క్లోజ్ చేయాలని అధికారులను సూచించారు. అర్జీలపై వెంటనే స్పందించి తప్పనిసరిగా గడువులోపల స్పష్టమైన వివరణ అర్జీదారునకు అందించి వీలైనంత సంతృప్తి స్థాయిని పెంపొందించాలని తెలిపారు.

'ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలి'


ఎంపీకి వినతి అందజేస్తున్న ప్రతినిధులు

గొల్లప్రోలు, ఆగస్టు 16: గొల్లప్రోలు రైల్వేస్టేషన్‌లో రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని ప్రయాణికుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆరేళ్ల క్రితం రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను రూ.3.10కోట్లుతో చేపట్టారని వారు తెలిపారు. ఈ పనుల్లో భాగంగా నూతన రైల్వేస్టేషన్ భవనం నిర్మాణం, 1,2,3 ప్లాట్‌ఫారమ్‌ల ఆధునీకరణ ఎత్తు, విస్తరణ చేయడం పూర్తయ్యాయని చెప్పారు. ఈ పనులు ప్రారంభానికి ముందు గొల్లప్రోలులో బొకారో, సింహాద్రి, రాయగడ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను రద్దు చేశారని తెలిపారు. అప్పట్లో దక్షిణ మధ్య జనరల్ మేనేజరు, విజయవాడ డీఆర్ఎంలకు విన్నవించగా, ఆధునీకరణ పనులు పూర్తయిన వెంటనే హాల్టులు కల్పిస్తామని చెప్పారని వివరించారు. రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు పూర్తయినందున ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని వారు ఎంపీని కోరారు. దీనిపై తాను రైల్వే అధికారులతో మాట్లాడతానని ఎంపీ హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో దంగేటి శ్రీరామకృష్ణ, రేకాటి నాగేశ్వరరావు, బొజ్జా ప్రసాద్, పడాల బాలరాజు, బోడకుర్తి శ్రీను ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నలుగురి అరెస్టు

జగ్గంపేట రూరల్, ఆగస్టు 16: మండలంలోని జె.కొత్తూరు గ్రామ శివారు రహస్యంగా నిర్వహిస్తేన్న పేకాట శిబిరంపై శుక్రవారం ఎస్ఐ టి.రఘునాధరావు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3200, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

జగ్గంపేట రూరల్, ఆగస్టు 16: మండలంలోని రాజపూడి గ్రామంలో విద్యుత్ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. వారం రోజుల నుంచి గ్రామంలోని కొత్తపేటలో విద్యుత్ సరఫరాకు తీవ్రంగా అంతరాయం ఏర్పడి కొత్తపేట కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న బీజేపీ సీనియర్ నేత కందుల అచ్యుతరామయ్య విద్యుత్ ఉన్నతాధికారులతో మాట్లాడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు.

వాజ్‌పాయ్‌కు నివాళి

ప్రత్తిపాడు, ఆగస్టు 16: భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పాయ్ వర్ధంతి సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద వాజ్‌పాయ్ చిత్రపటానికి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు, పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధికి ప్రధానిగా వాజ్‌పాయ్ ఎన్నో సేవలు అందించారని కొనియాడారు.

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం గ్రామంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ నేతృత్వంలో బీజేపీ శ్రేణులు వాజ్‌పాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పలు వీధుల్లో మొక్కలు నాటారు. భేరి గణేష్, అడ బాల సాయి, గోగుల అఖిల్, పైడిశెట్టి శ్రీనివాస్, కొల్లా మణికంఠ, చిత్రా శ్రీను, గిడియాల ప్రసన్న తదితరులున్నారు.

చింతమనీడి జన్మదిన వేడుకలు

తుని రూరల్, ఆగస్టు 16: టీడీపీ సీనియర్ నాయకుడు చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి) జన్మదిన వేడుకలు శుక్రవారం తునిలో నిర్వహించారు. శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలు చింతమనీడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయ ఓటర్ల జాబితా రూపొందించాలి : ఆర్డీవో

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 16: రాష్ట్ర శాసనమండలి తూర్పు పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఉపాధ్యాయ ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పనకు ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం చర్యలు చేపట్టాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఓటర్ల నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024 నవంబరు 1 క్వాలిఫైయింగ్ తేదీగా ఓటరు జాబితా నవీకరణపై గత నెల 29న నోటిఫికేషన్ రిటర్నింగ్ అధికారి పబ్లిక్ నోటీస్ జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలో తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియపై అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నూతన ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు ఓటర్లు ఫారం 19 సమర్పించడానికి సెప్టెంబరు 3 చివరితేదీ అని, ఓటర్ల జాబితాపై క్లయిమ్స్ అభ్యంతరాలు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 15వరకు అవకాశం ఉందని, అభ్యంతరాలను అక్టోబరు 30నాటికి పరిష్కరించి, తుది ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురిస్తామని పేర్కొన్నారు.

వనదుర్గ ఆలయంలో చండీహోమం

అన్నవరం, ఆగస్టు 16: రత్నగిరి క్షేత్రరక్షకిలు వనదుర్గ, కనకదుర్గ ఆలయాల్లో చండీహోమం, విశేషపూజలు నిర్వహించారు. వనదుర్గ ఆలయంలో పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.కనకదుర్గ ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు.

వైద్య సిబ్బంది ధర్నా

ప్రత్తిపాడు, ఆగస్టు 16: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన ఘటనను నిరసిస్తూ రాచపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్ఆర్‌పవన్ కుమార్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేసి జూనియర్ డాక్టర్ మృతికి కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రకటన

IN THE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE : KAKINADA

E.P. 86/2023 OS. 6/2019

Between
Sidhvi Infrastructure Projects Limited (Engineers and Contractors)
Rep. by its authorised person
M.V.V. Bhaskara Rao .. **DHr**
AND
Sai Concrete Pavers Private Limited.
Rep by its Mg. Director Sammeta Srinivas and another **JDr's**
To
Sammeta Srinivas, S/o. Seshagirirao, 49 years, MIG-2, H.No.49-58-2, Green Park area, Visakhapatnam-13

యిందు మూలముగా 2nd JDR అయిన మీకు పై నెంబరు E.P. లో కోర్టు ద్వారా ఎన్ని నోటీసులు పంపించినను ఉద్దేశ్యపూర్వకంగా రావాలని కోర్టు వారి నోటీసులు తిరస్కరించు చున్నారు. కావున 2nd JDR అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది. 23-08-2024 సంవత్సరం తేదీన ఉదయం 10.30 గంటలకు వాయిదా అయి ఉన్నది. కావున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. **ది. 23-08-2024 సంవత్సరం తేదీన ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగాకాని, ప్లీడరు ద్వారా కాని హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టువారి ముందు తెలియపరచుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

నూతలపాటి రాజశేఖర్
కాకినాడ DHR అడ్వకేటు
ది.16-8-24 కాకినాడ, సెల్ : 9390216389